


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -160-

**(14 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"ఈ సంవత్సరం ఆవకాయ** ప్రకరణం అత్యద్భుతమైన పరిణామాలందుకుంది. చరిత్రలో కనీ వినని స్థాయికి పోయింది. వాటిని గురించి మీరు వ్రాయలేదేం" అని ఒకరు ఉత్తరం వ్రాశారు.

ఆయనగారు చెప్పిన విషయం సత్యమే. మామిడికాయలు భూమిమీద పండటం ప్రారంభించిన తర్వాత ఈ సంవత్సరం అందుకున్న ప్రశస్తినీ, విలువనూ ఏనాడూ పొందలేదనడంలో సందేహం లేదు.

'వందకాయలూ వంద రూపాయలు' అమ్మడు చరిత్రలో ఎక్కడైనా వుందా అసలామాటలు వింటే ఏ గృహస్తు డైనా మూర్ఛపోకుండా వుంటాడా? పచ్చి మామిడికాయ ఒకొకటి రూపాయి.

ఇది ఆవకాయగా మారేటప్పటికి కాయకు మరో అర్ధరూపాయి. ఈ వార్త వినడం, విన్న తర్వాత నిలబడ కలగడం, నిలబడ్డా తర్వాత కొనగలగడం, తినగలగడం ఎంత ఆశ్చర్యకరమైన విషయం.

"ఊరగాయ జాడీలో వున్నప్పుడు ఫర్వాలేదుగాని లేనప్పుడు నోరు వూరి దుంప తెలుపుతుంది. ఆవకాయ పేరు జ్ఞాపకం వస్తే అన్నమే నోటి కెక్కదు. అందువల్ల అప్పు అయినా సరే, తప్పని సరిగా వూరగాయ పెట్టవలసిందే" అన్నాడొక గృహస్తు.

అసలు మామిడికాయలు ఈ సంవత్సరం భూమండలం మీదనే కాచాయా? చంద్రమండలం నుంచి దిగుమతి అయ్యాయా? అనిపిస్తుంది. చంద్రమండలం నుంచి వచ్చినా ఇంత చౌరవగా కొనేవారు కాదేమో? ఆరోగ్య రీత్యా మంచి అవునో కాదో అనే సందేహం వచ్చేదేమో 'ఆ కాయలు ఊరగాయ పెడితే సంవత్సరం పొడవునా వుంటాయో, వుండవో, ఇంత డబ్బుపోసి వాటిని ఊరగాయ పెట్టడం ఏమిటి? వద్దులెండి" అని ముసలమ్మలు అడ్డుపడేవారేమో?

"మా పనిమనిషికి కావాలంటే బ్రతిమాలి, బ్రతిమాలి వంద అరవై రూపాయల చొప్పున ఇప్పించాను. ఆ మర్నాడు మళ్ళీ వెళ్ళి అడిగితే, ఏభై అన్నారు. నీ అదృష్టం అరవైకి దొరికినాయి" అన్నాను పనిమనిషితో.

" 'అంతా మీ దయమ్మా' అని అది ఎంతో సంతోషించింది" అని ఒక గృహిణి తనలోగల పరోపకార పరాయణత్వాన్ని వెల్లడించింది.

ఈ సంవత్సరం మా అదృష్టదేవత మాగాయ కాయలు బుట్టలోనుంచి తొంగి చూచింది. ఎండలు ముదిరితే కష్టమని ముందుగానే మాగాయ కాయ పదహారు రూపాయల చొప్పున కొన్నాం. మరో నాలుగు రోజులు పోయిన తర్వాత ఆవకాయ పద్దెనిమిది రూపాయలకు కొన్నాం ఆ రసాలే తర్వాత వందదాకా పోయాయి.

తక్కువ ధరలో కొనుక్కున్నందుకు మమ్మల్ని మేం అభినందించుకోవడమే కాకుండా అనేకులచేత "మీరు అదృష్టవంతులు నిజంగా ధన్యులు. దూరదృష్టి కలవారు" మొదలైన కీర్తివాక్యాలు వినిపించుకోగలిగాం. ఇదంతా తంటాలుపడి తెచ్చుకున్న ఘనత కాదు. ఆ కాయలు కొన్న ఘడియ అలాంటిది.

బందరు నుంచి మిత్రులు రవణరావుగారు వచ్చారు. ఆయన ఆంధ్ర జాతీయ కళాశాలలో పనిచేస్తున్నారు. వారిని "ఏమిటి బందరు విశేషాలు?" అని అడిగాను.

"ఒకటే గొప్ప విషయం ఆవకాయ మామిడికాయ వంద రూపాయలకు అమ్మింది. చాలామంది ఆ ధరకే కొన్నారు. మేము మాత్రం ఎనభై రూపాయల చొప్పున రెండున్నర వందలు కొన్నాం. ఈ ఏడు తగ్గించాం. పెళ్ళిళ్ళు వగైరాలేమీ తలపెట్టలేదు గనుక. మామిడికాయ రెండువందలు పై ఖర్చు రెండు వందలు. మొత్తం ఊరగాయకు నాలుగు వందలు. ముక్క పావలా పడింది. తియ్యబుద్ధి కావడంలేదు. తినబుద్ధి పుట్టడంలేదు. జాడీల వంక చూడటం, తన్మయం చెందడం. అప్పులవాడు మాత్రం పేడిమూతి గూఢచారి'లాగా అప్పుడే వెంట పడుతున్నాడు. ఏం సంసారమండీ ఈ ఖర్చులతోబాటు ఒక పక్కకు పెరిగిపోతోంది" అన్నారు.

"మా యింట్లో ఊరగాయ వేసేది కేవలం పరువు కోసమేనండి. వాటిమీద ఆసక్తి లేదు, అధ్వానంలేదు. కొందరు కారం నంజుకుని ముక్కలు పారేస్తారు. కొందరు ముక్కలు నంజుకోవడానికి కారం తుడిచి వేస్తారు. ఎర్రగా కలుపుకుని తినేవారొక్కరూ లేరు. అయినా ఆవకాయ తప్పదు.

అతిథులు అడిగినప్పుడు లేదనాల్సి వస్తుందనీ, అలా అనడం గృహస్తు ధర్మం కాదనీ ఊరగాయలు పెట్టవలసి వస్తోంది. అందులో కూడా కొంత సత్యం వుంది. ఎన్ని వంటకాలు చేసినా, ఆవకాయకు ప్రత్యేకంగా మార్కులు పడతాయి తెలుగు పేపర్లో వ్యాకరణానికి పడ్డట్టు. ఆ విధంగా అతిధి సత్కారంలో ప్యాస్ మార్కులు సంపాదించుకోవచ్చు అనాలి. సంసారాలు రిమార్కులు లేకుండా గడపడమే కష్టం." మార్కుల మాట తర్వాత అన్నాడొక గృహస్థు.

గుడివాడనుంచి మా బావగారు వచ్చారు. ఆయన ఉపాధ్యాయుడు.

'ఏమిటి మాధవరావుగారూ, విశేషాలు?' అన్నాను.

ఆయన కొంచెసేపైనా ఆలోచించకుండా "మాగాయ కాయ యాభై రూపాయల చొప్పున కొన్నాను. కొన్నప్పటినుంచీ వానలు. ఎండవు, పెట్టవు. ఎలక్ట్రికల్‌గా వాటిని వేయించాలని చూస్తున్నాం.

ఇంత ఖరీదు పెట్టి కొని, ఎలా పారవేయడం? నలభై రూపాయలిచ్చి యాభై కొన్నాను. పూర్వం యాభై కాయలైతే మూడు రూపాయలుతో పోయేవి. ఇప్పుడెలా? ఆవకాయ కాయ వందకు కొన్నాను. పాతికతో సరిపెట్టాం. పైన బోలెడు అవుతుందిగా. మొత్తం ఊరగాయలకు నూటయాభై అయినాయి. ఇంకా జాడీల్లోకి ఎక్కలేదు.

పరీక్ష పేపర్లు దిద్దగా వచ్చిన డబ్బుకాక, పైన ఒక పాతిక రూపాయలు పడ్డాయి. ఊరగాయ వేసింది మేమేనా? కలయో, వైష్ణవ మాయయో? అన్నట్లుంది బావగారూ. మధ్య తరగతి సంసారాల సంగతేం చెప్పమంటారు? మధ్యధరా సముద్రంలో కూలిపోయిన విమానాల మాదిరిగా వున్నాయి" అని ఎంతో నైరాశ్యం ప్రకటించాడు.

మామిడిపండ్ల సంగతి చెప్పనక్కరలేదు. ఇంటికో పది పళ్ళన్నా అందలేదు. మొన్న ఒకాయన భార్య గర్భిణి అని బంగినపల్లి పండు ఒకటి తీసుకువెళుతున్నాడు. ఒక్కటి రూపాయిన్నరట. అంత మాత్రమైనా కొనగలిగినందుకు ఆ పురుషుడెంతో హర్షం ప్రకటించాడు. మామిడిపళ్ళ ఎగుమతులే ఎక్కువగా లేవు ఈ సంవత్సరం.

చాలామంది పళ్ళను తల్చుకుని లొట్టలు వేస్తూ పై సంవత్సరం కోసం ఎదురు చూస్తున్నారు పాపం.

Post your comments